క్లుప్తంగా

పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని సింగిల్ విండో కార్యాలయంలో శనివారం పోలీసుల సమక్షంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. సింగిల్ విండో కార్యాలయానికి యూరియా ఎరువులు వచ్చాయని తెలియగానే రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యాలయం వద్ద క్యూలో నిలుచొని ఒక్కొక్క రైతుకు ఒకటి చొప్పున యూరియా బస్తాను తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సరిపడా యూరియా బస్తాలు వెంటనే తెప్పించాలని డిమాండ్ చేశారు.

నష్టపరిహారం చెక్కు..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన అక్కరేణి రామవ్వకు శనివారం నష్టపరిహారం చెక్కును ఎర్రాపహడ్ అటవీశాఖ సెక్షన్ అధికారి వినోద్ అందజేశారు. బాధితురాలికి చెందిన లేగదూడను మే 25న అటవీ ప్రాంతంలో చిరుతపులి దాడి చేసి హతమార్చింది. ఈ విషయమై విచారణ చేసిన అధికారులు నష్టపరిహారం కోసం నివేదిక అధికారులకు పంపారు. దాంతో రూ. 7వేలు పరిహారం విడుదల కావడంతో బాధితురాలికి చెక్కును అందజేశారు. ఆయన వెంట బీట్ అధికారిణి కళ్యాణి ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన మహమ్మద్ నసీరుద్దీన్‌కు వైద్య చికిత్స కోసం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రూ. 12వేలను శనివారం ఆయన నివాసంలో అందజేశారు. నసీరుద్దీన్ ఎలక్ట్రీషన్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఎడమ చేతి వేళ్లకు తీవ్రగాయం కావడంతో వైద్యులతో చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చాట్ల వంశీ, సాయిబాబా, పంపరి శ్రీనివాస్ తదితరులున్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



బిచ్కుంద(జుక్కల్): బీజేపీతోనే దేశంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార సమక్షంలో సుమారు 50 మంది బీజేపీలో చేరారు.కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు విష్ణు, నాయకులు పండరి, చంద్రపాల్, గోపాల్ తదితరులున్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరం ఉన్న నిధులు మంజూరు చేయడంపై మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేశ్‌పటేల్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు డోంగ్లీ మండలంలోని మొగాలో శనివారం సీఎం రేవంత్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మొగా నుంచి మద్నూర్ రహదారిపై బ్రిడ్జి కూలిపోయిందని గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పరమేశ్ పటేల్ ఆరోపించారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణం కోసం రూ. 30 లక్షలు మంజూరు చేశారన్నారు. అలాగే మొగా గ్రామంలో రూ. 35 లక్షలతో సీసీ రోడ్డు, రూ.10 లక్షలతో మురికి కాలువల నిర్మాణం కోసం మంజూరు చేశారని ఆయన తెలిపారు. మొగా గ్రామంలో కొందరిని కాంగ్రెస్ పార్టీ నుంచి ఇటీవల బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని వారిలో ఒక్కరైనా గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా గెలిపించుకుంటే తన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి రాజీనామ చేస్తానని మాజీ ఎమ్మెల్యే సింధేకు సవాల్ విసిరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలున్నారు.

వరదలు మిగిల్చిన విషాదం

- వరదనీరు తొలగిపోయి తేలిన పొలాలు
- పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో బాధితులు
- ప్రభుత్వసాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు



నాగిరెడ్డిపేటలో వరదనీట మునిగి తేలడంతో రంగుమారిన వరిపంట



పూర్తిగా కుళ్లిపోయిన వరిపంట



పంటపొలాల్లో పేరుకుపోయిన బురద

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గత నెలఖరులో భారీగా కురిసిన వర్షాలతో నాగిరెడ్డిపేట మండలంలోని పలుగ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీవర్షాలతో వరదనీరు చెరువులు, కుంటలను చేరింది. వరదనీటి తీవ్రతను తాళలేక మండలంలోని నాగిరెడ్డిపేట శివారులో గల పటేల్‌చెరువుకు, మండలంలోని మాల్తుమ్మెద శివారులో గల ఊరచెరువుకు గండ్లు పడ్డాయి. దీంతోపాటు చెరువుల పక్కనే ఉన్న పోచారం ప్రధానకాలువ సైతం తీవ్రంగా దెబ్బతింది. చెరువుల్లోని వరదనీటితోపాటు కాలువలోని వరదనీరు పూర్తిగా పంటపొలాలను ముంచెత్తుతూ దిగువకు ప్రవహించింది. మండలంలోని పోచారం ప్రాజెక్టు అలుగుపైనుంచి దిగువకు భారీగా ప్రవహించిన వరదనీరు సైతం మంజీరలోకి చేరి పంటలను పూర్తిగా ముంచెత్తింది. పంటపొలాల్లో చేరిన నీరు సుమారు వారంరోజులపాటు అలాగే ఉండడంతో పంటలు పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతోపాటు పంటపొలాల్లో రాళ్లు, ఇసుకమేటలు, బురద పేరుకుపోయింది. పంట పొలాల్లో పేరుకుపోయిన ఇసుకమేటలను ఉపాధి హామీ ద్వారా తొలగించేందుకు సంబంధింత అధికారులు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించారు.

కొనసాగుతున్న సర్వే ప్రక్రియ..

నాగిరెడ్డిపేట మండలంలో సుమారు 3,900ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు అంచనాలు వేస్తున్నారు. నష్టపోయిన పంటల వివరాలను సేకరించేందుకు వ్యవసాయాధికారులు సర్వే చేపట్టారు. నష్టపోయిన పంటల వివరాలతోపాటు బాధిత రైతుల బ్యాంకుఖాతాల వివరాలను వారు సేకరిస్తున్నారు. పంటనష్టం వివరాలతో కూడిన నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేయనున్నారు. నష్టపోయిన పంటలకు సంబంధించి చెల్లించాల్సిన పరిహారం విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం బాధితరైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటపూర్తిగా పోయింది



భారీ వర్షాలతో వచ్చిన వరద కారణంగా నాకున్న రెండెకరాల్లోని వరిపంట పూర్తిగా కుళ్లిపోయింది. దీంతో ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయాను. వారం రోజులకు పైగా పంట వరదనీటిలోనే ఉండడంతో పూర్తిగా కుళ్లిపోయింది.

– కలాలి సతీష్‌గౌడ్, రైతు, లింగంపల్లికలాన్

రాళ్లు, ఇసుక మేటలు వేశాయి



మా ఊరి శివారులోని పటేల్‌చెరువు కింద నాకున్న నాలుగు ఎకరాల్లో వరిపంట వేశాను. భారీవర్షాలతో పటేల్‌చెరువుకు గండి పడింది. వరదనీటి తీవ్రతకు చెరువు పక్కనే ఉన్న పోచారం ప్రధానకాలువ సైతం పూర్తిగా ధ్వంసమైంది. రాళ్లు వరదనీటిలో కొట్టుకువచ్చి నా పొలంలో చేరాయి. – బోయిని విఠల్, రైతు, నాగిరెడ్డిపేట గ్రామం

అప్పుల పాలయ్యాను



వరదనీటిలో మునిగి నా రెండెకరాల 10గుంటల్లోని వరిపంట పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. పంటలసాగు కోసం ఇతరుల వద్ద అప్పులు చేశాను. ప్రస్తుతం పంట కుళ్లిపోవడంతో అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మంత్రిరాజు, రైతు, లింగంపల్లికలాన్

మల్లారం చెరువుకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న డీఈ వెంకటేశ్వర్లు



తిర్మలాపూర్ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువకు చేస్తున్న మరమ్మతు పనులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) గ్రామ శివారులోని మల్లారం చెరువు కట్ట తెగిపోయి నీరంతా వృథాగా పోయింది. ఈ క్రమంలో చెరువులో వర్షం నీరు నిల్వ ఉండడానికి తాత్కాలికంగా కట్టను నిర్మిస్తున్నారు. ఈ సీజన్‌లో రైతుల పంటలను కాపాడడానికి చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. దాంతో పనులు వేగవంతంగా చేపట్టాలని ఏఈ సంతోష్‌కుమార్ సూచించారు. మరమ్మతుల పనులు పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏఈ, రైతులు ఉన్నారు.

డీ–9కు తాత్కాలిక మరమ్మతులు

బాన్సువాడ రూరల్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, ప్రధాన కాలువకు వచ్చిన భారీ వరద మూలంగా తిర్మలాపూర్ శివారులోని డీ–9 వద్ద నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట బలహీనంగా మారింది. ప్రధాన కాలువద్వారా నీటిని విడుదల చేసినప్పుడు లీకేజీ అవుతుండటం, బుంగలకు ఆస్కారం ఏర్పడటంతో నీటిపారుదల శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ప్రధాన కాలువ నీరు ప్రవహించే వైపు సిమెంట్ సంచుల్లో ఇసుక నింపి వరుస క్రమంలో వేయడంతో పాటు రాళ్ల తెట్టెను మొరంతో చదును చేయిస్తున్నారు. కాలువకు నీటిని వదిలి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే శాశ్వత మరమ్మతులు చేయిస్తామని నీటిపారుదల శాఖ ఏఈ నితిన్ తెలిపారు.

108 అంబులెన్స్ తనిఖీ



మాచారెడ్డి: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను శనివారం మేనేజర్ తిరుపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్సులోని పరికరాలను పరిశీలించారు. అంబులెన్సు ఉద్యోగులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంబులెన్సు ఉద్యోగులు ఈఎంటీ నరేష్,పైలట్ మహేష్ ఉన్నారు.

చెరువును తలపిస్తున్న గురుకుల పాఠశాల ప్రాంగణం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. దీంతో విద్యార్థులు,టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్‌లో నీరు నిలువకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంట పొలాల్లో ఇసుక మేటల తొలగింపు



బూరుగిద్ద శివారులో ఇసుక మేటల తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాలకు పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలను శనివారం ఉపాధి హామీ కూలీలతో తొలగించినట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బూరుగిద్ద ఊర చెరువు కట్ట తెగిపోవడంతో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. కలెక్టర్ ఆదేశాల మేరకుఇసుక మేటలు తొలగించి తిరిగి పంటలకు సాగు చేసుకోవడానికి సిద్ధం చేసి ఇస్తామన్నారు. క్షేత్రసహాయకుడు సాయన్న ఉన్నారు.

తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కమిటీ ఎన్నిక



రమేశ్ రావు



ఆకుల మహేందర్

కామారెడ్డి టౌన్: తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా నూతన కమిటీని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిమ్మంజి రమేశ్ రావు, ఉపాధ్యక్షుడిగా మాసం దివ్యశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మహేందర్, గౌరవ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి, కోశాధికారిగా రామచంద్రం, గౌరవ సలహాదారులుగా సవిత, లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు.

పొంగిపొర్లుతున్న కొల్లూర్ వాగు



బాన్సువాడ రూరల్: కురుస్తున్న భారీ వర్షాలతో వాగులను వరద ముంచెత్తుతోంది. మండలంలోని కొల్లూర్ వాగు, తాడ్కోల్ శివారులోని వాగు, ఆర్టీసీ డిపోవద్ద గల వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వాగుల్లో వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



రామారెడ్డిలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న రామకృష్ణ మఠం సభ్యులు

రామారెడ్డి/భిక్కనూరు : మండలకేంద్రంలోని వరద బాధితులకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రామారెడ్డి తహసీల్‌కార్యాలయం వద్ద 22 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం బస్తా, ఒక చద్దర్, నెలకు సరిపడా కిరణా సామన్లను అందించినట్లు రామకృష్ణ మఠం స్వామీజీ తత్వమయానంద మహరాజ్ తెలిపారు.భిక్కనూరు మండలంలో ఇళ్లు కూలిపోయిన 61 కుటుంబాలకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను తహసీల్దార్ సునీత శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమలత, గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, కారోబార్ శ్రీధర్, స్వచ్ఛంద సేవకులు సూర్య ప్రకాష్, సొడం నవీన్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మైనారిటీల విరాళం

మాచారెడ్డి: లచ్చాపేట గ్రామానికి చెందిన మైనారిటీలు పంజాబ్ వరద బాధితుల కోసం రూ. 20 వేలు విరాళాన్ని అందజేశారు. శనివారం జమైతే హింద్ కామారెడ్డి కమిటీ ప్రతినిధులకు సాయం అందించారు.జమైతే హింద్ ప్రతినిధులు యూసఫ్, మస్తాన్, బాబుమియా, ఆసిఫ్ తదితరులున్నారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

భిక్కనూరు: వర్షాలకు నష్టపోయిన ప్రజలకు, రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అందే దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన జాగీర్ సింగ్ అనే వ్యక్తి మూడు రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా గోడకూలి మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాటిపాముల విజయ్ కుమార్ గౌడ్ బాధిత కుటుంబానికి రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జాగీర్ సింగ్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. సొసైటీ చైర్మన్ గంగాల భూమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్యాల సుదర్శన్, మాజీ వైస్ ఎంపీపీ తాటిపాముల లింబాద్రి, సొసైటీ డైరెక్టర్ సాజిద్ పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఘనంగా జాతీయ భాషాదినోత్సవం



బాన్సువాడ రూరల్: జాతీయ భాష హిందీ దివాస్‌ను శనివారం మండలంలోని కొయ్యగుట్టలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. హిందీలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీబాయి పాఠశాలకు చెందిన హింది అధ్యాపకులు గౌసియాబేగం, ఆస్మాబేగంలను ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్‌తో కలిసి సన్మానించారు. దేశంలో హిందీ భాషను 70శాతం మంది మాట్లాడుతారని అయ్యాల సంతోష్ అన్నారు. పాఠశాల దశ నుంచే హిందీ చదవడం, రాయడం , మాట్లాడటం నేర్చుకుంటే జాతీయ స్థాయిలో జరిగే అన్నిరకాల పోటీ పరీక్షలు రాయవచ్చన్నారు. అధ్యాపకులు మంజుల, శ్రీవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిదాన నిర్మాణానికి విరాళాల వెల్లువ



అయ్యప్ప సన్నిదానానికి విరాళం ఇస్తున్న భక్తులు



ఎమ్మెల్యేకు విరాళం అందజేస్తున్న దాతలు

భిక్కనూరు : తిప్పాపూర్‌లో అయ్యప్ప సన్నిదాన నిర్మాణానికి శనివారం భక్తులు పెద్ద ఎత్తున విరాళాలను అందజేశారు. గ్రామానికి చెందిన ఏనుగు చంద్రారెడ్డి రూ. 50 వేల విద్యుత్ సామగ్రిని అందజేశారు. ఏనుగు రాంరెడ్డి రూ. 25 వేల నగదును అందజేయగా, నిజామాబాద్ నగరానికి చెందిన పీతాంబర్ గౌడ్-శైలజ దంపతులు రూ. 10 వేలు, సిద్దిపేటకు చెందిన రుచిత- అవినాష్ గౌడ్ దంపతులు రూ. 15 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సన్నిదాన నిర్మాణానికి విరాళాలు అందజేసిన భక్తులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.1.11 లక్షలు...

బాన్సువాడ : బోధన్ పట్టణం అచన్‌పల్లికి చెందిన కామేపల్లి ప్రశాంత్, ప్రవళిక దంపతులు బీర్కూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.1.11 లక్షలను విరాళంగా ఆలయ ధర్మకర్త వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పోచారం శంభురెడ్డిలకు అందజేశారు. ఆలయంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



బాన్సువాడలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న వార్డెన్ గంగసుధ

బాన్సువాడ : వసతి గృహంలో ఉండే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్సీ బాలికల వసతి గృహ వార్డెన్ గంగసుధ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆమె విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందించే అన్ని వసతులను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు పాఠశాలల నుంచి వచ్చిన తర్వాత వసతి గృహంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు వార్డెన్ చేస్తున్న సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పలు వసతి గృహాలలో తల్లిదండ్రుల సమావేశం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తల్లితండ్రులు వారి పిల్లలను ప్రతి ఆదివారం తీసుకునేందుకు కాని కలిసేందుకు కాని రావద్దని తలిదండ్రులకు సూచించారు. దసరా, సంక్రాంతి సెలవులలో మాత్రమే విద్యార్థులను ఇంటికి పంపాస్తామన్నారు. వార్డెన్లు కృష్ణ, శారద, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు



బాన్సువాడ : బీర్కూర్ సహకార సంఘం అధ్యక్ష పదవీ పాత కాంగ్రెస్ నేతకు ఇవ్వాలని శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎంపీ సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు కలిశారు. బీర్కూర్ సహకార సంఘం అధ్యక్ష పదవీని పాత కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు పోగు పాండుకు ఇవ్వాలని మహేశ్‌కుమార్ గౌడ్‌కు విన్నవించారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి బీర్కూర్ సహకార సంఘం అధ్యక్ష పదవిపై చర్చించారు. బీర్కూర్ సహకార సంఘం అధ్యక్షులుగా గాంధీ ఆరు నెలల క్రితం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. నాయకులు కొత్త కొండ భాస్కర్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి గణేష్, ప్రతాప్‌సింగ్, పోగు పాండు, నందురెడ్డి, అంజాద్‌ఖాన్, సాయాగౌడ్ తదితరులున్నారు.

సంక్షిప్తం

తెలంగాణా విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం



తాడ్వాయి/లింగంపేట : ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా జరపాలని బీజేపీ లింగంపేట మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ డిమాండు చేశారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాడ్వాయి బీజేపీ కార్యాలయంలో నాయకులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిందర్‌రావు మాట్లాడుతు తెలంగాణా విమోచన దినోత్సవంతో పాటు ప్రధాని మోదీ జన్మదినవేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జాతీయ జెండావిష్కరణ, బైక్‌ర్యాలీ, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాలను నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, హోటల్ శ్రీను, వెంకట్‌రావు, రాజిరెడ్డి, రవిందర్‌రెడ్డి, దత్తాత్రేయ, బత్తులస్వామి, రాజాగౌడ్, దత్తురాం, రాంచందర్, రజనీకాంత్, ఉదేష్, విష్ణువర్ధన్, శుభాష్, నరేష్, పోశెట్టి, ఎల్లేశం, మల్లయ్య, సంతోష్, గణేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 15, 16న స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డి/మద్నూర్/కామారెడ్డి అర్బన్ : ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16 తేదీలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సరిఫ్టికెట్లతో కళాశాలకు ఉదయం పది గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ఆశోక్ తెలిపారు. అలాగే కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15,16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో కళాశాలకు రావాలని ప్రిన్సిపాళ్లు తెలిపారు.

సమీక్ష సమావేశంలో పాల్గొన్న మండల వర్కింగ్ ప్రెసిడెంట్



రాజంపేట : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి హాజరైనట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల కోసం పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసే విధంగా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు.